మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# విద్యా వ్యవస్థ నిర్వీర్యం

**కాంగ్రెస్ హయాంలో విద్యకు పెద్దపీట**

**11 వేల ఉపాధ్యాయులను నియమించాం**

**మెస్ చార్జీలు రూ.40 పెంచాం**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌గర్ బ్యూరో, డిసెంబరు 29 ప్రభాతవార్త:** విద్యావ్యవస్థను గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా విస్మరించిందని విద్యార్థులకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలను కూడా కల్పించలేక పోయిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని బాలుర హాస్టల్‌ను సందర్శించి ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యావ్యవస్థ కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. హాస్టల్ విద్యార్థులకు 40 డైట్ చార్జీలు పెంచి వారికి బలవర్ధకమైన ఆహారం అందించడంతో పాటు విద్యావ్యవస్థ బలోపేతానికి 11 వేల ఉపాధ్యాయుల నియమించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేయుటకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ , వైస్ చైర్మన్ షబ్బీర్ అలీ ,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ మోహన్‌బాబు ,హాస్టల్ వార్డెన్ గోవర్ధన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నాయకులు అజ్మత్ అలి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీని పరామర్శించిన మాజీ మంత్రి కేటీఆర్



నిమ్స్ ఆస్పత్రిలో మాజీ ఎంపీ మంద జగన్నాథం ను పరామర్శించిన మాజీ మంత్రి కేటీఆర్

**ఇటిక్యాల, డిసెంబరు 28 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ పార్లమెంటు మాజీ ఎంపీ మంద జగన్నాథం అనారోగ్యంతో వారం రోజుల క్రితం హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్, నాయకులు డా. దాసోజు శ్రవణ్ కుమార్ నిమ్స్ ఆస్పత్రికి చేరుకొని మాజీ ఎంపీ మంద జగన్నాథం ను ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్లతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బుడ్డారెడ్డిపల్లి విజయ్ కుమార్ నిమ్స్ ఆస్పత్రికి చేరుకొని మాజీ ఎంపీ ముంద జగన్నాథంను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ఆయన తనయుడు మంద శ్రీనాథ్‌తో మాట్లాడారు.

# ఒంటికాలుపై నిలబడి సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



ఒంటి కాలుపై నిరసన తెలుపుతున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 29 ప్రభాతవార్త:** గత 15 సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్న తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని నాగర్‌కర్నూల్ సమగ్ర శిక్ష జేఏసీ అధ్యక్షుడు మురళి అన్నారు. జిల్లా అధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పట్టణంలోని పాత కలెక్టరేట్ వద్ద చేపడుతున్న నిరసన కార్యక్రమం ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. ఈ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె దీక్షకు కొల్లాపూర్ పట్టణానికి చెందిన వివిధ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సంఘీభావం తెలిపారు. ఆదివారం 20వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఒంటి కాలుపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మురళి మాట్లాడుతూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కొరకు గత 20 రోజుల నుంచి సమ్మె చేపడుతున్నామని ప్రభుత్వం మా సమస్యల పరిష్కారం చూపకుండా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. తాము విద్యాశాఖ తెలంగాణ సమగ్ర శిక్ష ఒప్పంద పద్ధతిలో అర్హతలతో ఇంటర్వ్యూ ద్వారా ఎంపికైనట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలు హోదాల్లో 21 వేలకు పైగా ఉద్యోగులను 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అర్హతలు ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రతకు నోచుకోకపోవడమేమిటని ప్రశ్నించారు. వేరే రాష్ట్రాలలో క్రమబద్ధీకరణ చేయడం జరిగిందని గుర్తు చేశారు. కనీస వేతన స్కేలు అమలు చేయడం లేదని ఉద్యోగ భద్రత, ఆరోగ్య ప్రమాద బీమా సౌకర్యాలు కూడా లేవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

## త్వరలో వనపర్తికి సీఎం రేవంత్ రెడ్డి రాక : ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 29 ప్రభాతవార్త:** వనపర్తి నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు,ప్రారంభాలు,శంకుస్థాపనలపై త్వరలోనే వనపర్తికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రానున్నట్లు వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన ఆయన నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించిన అంశాలతో పాటు,విద్య వైద్యం వ్యవసాయం సాగునీరు లాంటి తదితరుల అంశాలపై కీలకంగా చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ ప్రత్యేక భేటిలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి పాల్గొని పార్లమెంటు పరిధిలో నిర్వహించనున్న ఉద్యోగ మేళా, రుణమేళకు సంబంధించిన అంశాలపై చర్చించారని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి వనపర్తి నియోజకవర్గానికి వచ్చే తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.



సిఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి, ఎం పి మల్లు రవి

# కేసుల నమోదులో జడ్చర్ల టాప్



- అత్యధికంగా ఏడాదిలో 933 కేసులు
- రెండో స్థానంలో మహబూబ్‌నగర్ 844
- అత్యల్పంగా మూసాపేట స్టేషన్ లో 204 నమోదు
- పెరిగిన రోడ్డు ప్రమాదాలు,మరణాలు
- వార్షిక ప్రణాళిక విడుదల చేసిన ఎస్పీ జానకీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 29, ప్రభాత వార్త:** 2024సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలతో పాటు మరణాలు కూడా పెరిగాయి. సమాజంలో జరిగే నేరాలను అదుపు చేయడానికి ఓ వైపు పోలీస్ శాఖ విశ్వప్రయత్నాలు చేస్తున్నా కొన్ని అసాంఘిక శక్తుల వల్ల ఆ సంఖ్యం మాత్రం తగ్గడం లేదని చెప్పవచ్చు. జిల్లాలో ఎస్పీ జానకీ ధరావత్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై కళాజాతతోపాటు పాఠశాల విద్యాలయాల్లో అవగాహన కల్పిస్తూ వచ్చారు. రోజురోజుకూ సైబర్ నేరగాళ్లు కొత్త రూపంలో అనేక దారులను ఎంచుకొని సైబర్ నేరాలకు పాల్పడతున్న క్రమంలో కేసుల సంఖ్య సైతం పెరుగుతున్నది. గత ఏడాది 2023లో జిల్లా వ్యాప్తంగా 17స్టేషన్ల పరిధిలో 5869 కేసులు నమోదు కాగా ఈ యేడాది 27డిసెంబర్ వరకు 5887 కేసులు నమోదు అయ్యాయి.





వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ

**జడ్చర్ల టాప్**

జడ్చర్ల స్టేషన్ పరిధిలో కేసుల సఖ్యం పెరిగింది. జిల్లాలోని 17స్టేషన్లలో మహబూబ్‌నగర్ స్టేషన్ కంటే కూడా ఎక్కువగా నమోదు కావడం గమనార్హం. జడ్చర్ల స్టేషన్‌లో గత నాలుగేండ్లుగా కేసుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. 2021లో 688,2022లో 882, 2023లో 897కేసులు నమోదు కాగా ఈ యేడాది అత్యధికంగా 913 నమోదయ్యాయి. జడ్చర్ల మీదుగా జాతీయ, రాష్ట్ర రహదారులు వెళ్లడం కూడా కేసులు పెరుగుదలకు కారణంగా చెప్పవచ్చు. ఇదిలా ఉండగా జడ్చర్ల స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉన్నట్లు తెలుస్తున్నది. జాతీయ రహదారులు ఉన్నందునా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు ఆవశ్యకత ఉన్నది. ఇదే విషయమై గతంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ప్రభుత్వానికి నివేదించగా అదే విషయాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పలుమార్లు ప్రస్తావించారు.

పోలీస్ శాఖ చేధించిన పలు కేసులు

- జూలై 16న జడ్చర్ల బస్టాండ్‌లో రూ.36లక్షలు చోరీకి గురి కావడంతో సీఐలు ఆదిరెడ్డి,నాగార్జున గౌడ్ తమ సిబ్బందితో కలిసి కేసును చేధించి రూ.29లక్షల25వేలు రికవీ చేసి నిందితులు ఎండీ ఫారుక్, అబ్దుల్ సత్తార్, షేక్ దిల్షాన్ అహ్మద్‌ను రిమాండ్‌కు తరలించారు.
- మే 24న అడ్డాకుల మండలం శాఖాపూర్ వద్ద గుర్తు తెలియని దుండగలు మహిళను బ్లేడుతో గొంతుకోసి బండ రాయితో కొట్టి దాడి చంపారు. భూత్పూర్ సర్కిల్ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసును చేధించి బోయ ఖాసమయ్యను రిమాండ్‌కు తరలించారు.
- జడ్చర్లలోని విఘ్నేశ్వర ఏజెన్సీలోని సిగరేట్ గిడ్డంగిలో రూ.32లక్షల విలువ చేసే సిగరేట్ కాటన్లు చోరి కాగా సీఐలు ఆదిరెడ్డి, నాగార్జున గౌడ్ తమ సిబ్బందితో కలిసి కేసును ఛేదించి మాణిక్ చంద్, కైలాష్, గణపత్ నిందితులను అరెస్ట్ చేశారు.

| నేరం | 2023 | 2024 |
|---|---|---|
| కిడ్నాప్ | 65 | 72 |
| రేప్ | 103 | 105 |
| అటెంప్ట్ మర్డర్ | 24 | 23 |

| రోడ్డు ప్రమాదాలు.. 2023 | |
|---|---|
| కేసులు | మరణాలు |
| 230 | 244 |

| రోడ్డు ప్రమాదాలు.. 2024 | |
|---|---|
| కేసులు | మరణాలు |
| 257 | 273 |

**పారదర్శకంగా సేవలు**



పోలీస్ శాఖ జిల్లా ప్రజలందరికీ బాధ్యతాయుతంగా జవాబుదారితనంతో పారదర్శకంగా సేవలందిస్తున్నాం. ప్రజల ధన మాన,ప్రాణ రక్షణ కోసం అనుక్షనం పని పని చేస్తున్నాం. జిల్లాలో జాతీయ రహదారులు ఎన్‌హెచ్ -44, ఎన్‌హెచ్ -167,ఎన్‌హెచ్ -167ఎన్‌తోపాటు ఎస్‌హెచ్ 20,21 ఉన్నందునా చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వాహనదారులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. పెట్రోకార్, సైన్ బోర్డులు, రబ్బర్ స్ట్రిప్స్,అప్రోచ్ రోడ్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశాం. ప్రధాన కేసులే చాలా వరకు చేధించాం. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితులకు న్యాయం చేశాం. ఏడాది 3216దరఖాస్తులకుగాను 1056పోన్లను వ్యక్తులకు అందజేశాం. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కింద 109మంది పిల్లలను రక్షించాం.

*- జానకీ ధరావత్, ఎస్పీ మహబూబ్‌నగర్*

# తిరుమల శ్రీవారి దర్శనంలో తెలంగాణ భక్తులకు అవమానం

**తిరుమల శ్రీనివాసుడు ప్రపంచ భక్తులకు దేవుడు**

**ఈ విషయంలో సిఎం చంద్రబాబు స్పందించాలి**

**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవేదన**

**గద్వాల, డిసెంబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజలకు ఆంధ్రా ప్రాంతంతో ఉన్న ఏకైక అనుబంధం తిరుపతి, తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం అని అక్కడ తెలంగాణ ప్రాంత భక్తులు, ప్రజాప్రతినిధులు, ఈ ప్రాంత అధికారులు, అనదికారులపై వివక్ష కొనసాగుతున్నదని, శ్రీనివాసుని దర్శనం దక్కకుండా చేస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి భక్తులకు, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు గౌరవించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి కి, టిటిడి చైర్మన్, ఈ ఓ ను కోరారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు గద్వాల్ నుంచి పట్టుచీర సమర్పించడం గద్వాల సంస్తానాదీషుల కాలం నుంచి ఆనవాయితీగా ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తిరుమలలో తెలంగాణ నాయకుల సిఫార్సు లేఖలను స్వీకరించాలని అయన డిమాండ్ చేశారు. ఆదివారం గద్వాల్ నియోజకవర్గంలోని జములమ్మ అమ్మవారిని కుటుంబ సమేతంగా మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్ దర్శించుకున్నారు. అనంతరం బాసు హనుమంతు నాయుడు స్వగృహం నందు మీడియాతో మాట్లాడుతూ తిరుపతి తిరుమలకు, గద్వాల సమస్తానానికి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తిరుపతి, తిరుమలకు చెందిన కవులు, కలా కారులకు, వెంకట కవులకు, పూజారులకు ఇక్కడ సంస్థనాదీషులు సగౌరవంగా సన్మానం చేసే వారన్నారు. అందుచేత ఈ ప్రాంతానికి విద్వత్ గద్వాలగా తిరుపతి, తిరుమల వెంకట కవులే రాజుల కాలం నాడే బిరుదు ఇచ్చారన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు తిరుమల వెంకటేశ్వరస్వామికి భ్రమ్మోస్తావాల సమయంలో పట్టు వస్త్రాలు కూడా గద్వాల చేనేత కార్మికులు అందిస్తూ వస్తున్నారన్నారు. తిరుపతి, తిరుమలలో తెలంగాణ భక్తులను అవమాణించడం సరైనది కాదన్నారు. జములమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారన్నారు. ఓ శక్తి పీఠం జోగులాంబ తల్లి ఉన్న ప్రాంతం ఈ గద్వాల జిల్లా అని పేర్కొన్నారు.తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డ కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకుని తలనీలాలు లసమర్పించుకోవాలని అనుకుంటారు అని అన్నారు. గతంలో తిరుమల దర్శనాల విషయంలో ఎలాంటి తేడా లేకుండా జరిగాయి అన్నారు.కానీ,తిరుమలలో తెలంగాణ భక్తులు, రాజకీయ నాయకుల పై వివక్ష చూపుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రజా ప్రతినిధులకు టీటీడీ గతంలో కల్పిస్తున్న సౌకర్యాలను పునరుద్ధరించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు.తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలకు గద్వాల్ ప్రాంతం నుంచి పట్టుచీరను సమర్పించడం ఆనవాయితీగా ఉందని శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ కిషోర్,రవి ప్రకాష్ గౌడ్,మోనేష్,శేఖర్ నాయుడు,తిరుమలేష్,గంజీపేట రాజు, వీరేష్ గౌడ్,చంద్రన్న గౌడ్,ఎస్.రాము నాయుడు,కంగారు తిమ్మప్ప,ముని మోర్య,బాసు గోపాల్,బిచుపల్లి,ఎండి.మాజ్, సూరి,మహబూబ్,జస్వంత్,జనార్ధన్, చాకలి శ్రీనివాసులు,భాస్కర్,వెంకటేష్ గౌడ్,రమేష్,కామేష్, మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పిటీసీ బాసు శామల, హన్మంత్ నాయుడు

# త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు

**మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**35 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**



కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 29 ప్రభాతవార్త:** మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి చెందిన 35 మందికి కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళా సంక్షేమానికి ఎన్నో పథకాలు ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన గుర్తు చేశారు.అందులో భాగంగా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణంతో పాటు సిలిండర్ రూ.500 లకు అందిస్తున్నామన్నారు.త్వరలో ఇందిరమ్మ ఇండ్లు కూడా మహిళల పేరునే వస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, అజ్మత్ అలి, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

# పాలెం విద్యాలయాలకు పూర్వవైభవం తెద్దాం

**బిజినేపల్లి, డిసెంబరు 29 ప్రభాతవార్త:** మార్గదర్శి పాలెం సుబ్బయ్య స్థాపించిన విద్యాసంస్థలకు పూర్వవైభవం తేవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెల్దండ నిత్యానంద రావు అన్నారు. పాలెం పూర్వ విద్యార్థుల సంఘం 36 వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థి వైస్ ఛాన్సలర్ నిత్యానందరావు మాట్లాడుతూ 60 ఏళ్లకు పూర్వం విద్యాసంస్థలు నెలకొల్పడం గొప్ప విషయం అని అన్నారు. వలస పాలమూరు జిల్లాలో మారుమూల ప్రాంతంలోని పల్లెలో పేదవాడి జీవితాల్లో చదువుతో వెలుగులు నింపిన విధాతగా కొనియాడారు. సుబ్బయ్య స్థాపించిన విద్యాసంస్థల్లో అభ్యసించడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ నిత్యానంద రావు





వైస్ ఛాన్సలర్ సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పాలెం విద్యాలయాలు సాధించినవిజయాలను, అధిగమించిన మైలురాళ్లను సభావేదికగా పూర్వ విద్యార్థులు పంచుకున్నారు. పూర్వవిద్యార్థుల విశిష్టతను, వివిధ రంగాల్లో వారు సాధించిన ప్రగతిని పలువురు కొనియాడారు. భావితరాలకు తమ విజ్ఞానాన్ని పంచేవిధంగా తదుపరి కార్యాచరణను అధ్యక్షులు బి బుడ్డయ్య, కార్యదర్శి కె మోహన్ బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ జనరల్ సెక్రెటరీ ఏ శ్రీరాములు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రంగాచార్య డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మజా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆనంద్ గౌడ్ రిటైర్డ్ టీచర్ కే జగన్నాథ్ రెడ్డి, పూర్వ విద్యార్థులు డాక్టర్ అనుపటి మల్లికార్జున్, లక్ష్మికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరించిన రైతులకు వేగంగా ఖాతాల్లోకి నగదు జమ చేయాలి

**అదనపు కలెక్టర్ జి వెంకటేశ్వర్లు**

**పెబ్బేరు డిసెంబరు 29 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత వారికి వేగంగా ఖాతాల్లోకి నగదు పడేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఆదివారం పెబ్బేరు, శ్రీరంగాపురం, పుల్గర్ చర్ల గ్రామాల్లో ఐ.కే.పి, సహకార సంఘాల ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ధాన్యం సేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, తేమ, తాలు, చెత్త లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను సూచించారు.సేకరించిన ధాన్యాన్ని నిర్దేశించిన మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలని అదేవిధంగా ఆన్లైన్ లో నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అకస్మాత్తుగా వచ్చే వర్షాల నుండి ధాన్యానికి రక్షణ కల్పించే విధంగా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.



పెబ్బేర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

## సమగ్ర శిక్ష ఉద్యోగులు త్వరలో శుభవార్త వింటారు

**పేట జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి**

**నారాయణపేట టౌన్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలంటూ నారాయణపేట జిల్లా కేంద్రం మున్సిపల్ పార్క్ వద్ద చేపట్టిన సమ్మె ఆదివారంతో 19 వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఆదివారం నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి సమ్మె దగ్గరకు వచ్చి సంఘీభావం తెలిపి వారితో పాటు కూర్చున్నాడు. అనంతరం సమ్మెనుద్దేశించి అయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తానని ప్రభుత్వంకు మీ సమస్యలపై అవగాహన ఉందని త్వరలోనే సమగ్ర శిక్ష ఉద్యోగులు శుభవార్త వింటారన్నారు. ఈ కార్యక్రమంలో పేట మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ, కాంగ్రెస్ నాయకులు గందే చంద్రకాంత్, సంతోష్ కుమార్, నరహరి,సతీష్ గౌడ్,కోట్ల రవీందర్ రెడ్డి, మారుతి, సునీల్ కుమార్‌లతో సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు కిరణ్ అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరే న్యాయమైన డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని వారితో చర్చించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్, జిల్లా అధ్యక్షులు సాయికుమార్, టియూసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహా, జిల్లా ఉపాధ్యక్షులు ఎదురింటి నర్సింహాలు మరియు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉన్నారు.



నిరవధిక సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

## ప్రజలు సైబర్ నేరాల నుండి అప్రమత్తంగా ఉండాలి

**సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ గుర్తుకు రావాలి**

**నారాయణపేట టౌన్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ప్రజలు సైబర్ నేరాల నుండి అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పై ఆంజనేయులు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రం, మున్సిపల్ పార్కు వద్ద ఎ ఎస్పై ఆంజనేయులు ఆధ్వర్యంలో నారాయణపేట పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలు, మతకలహాల గొడవలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలు, బాల్యవివాహాలు, వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల కార్మిక వ్యవస్థ, సీసీ కెమెరాల ఉపయోగం మొదలగు పలు సామాజిక అంశాలపై నారాయణపేట పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పై మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని లాటరీ తగిలిందని, తక్కువడికి లోన్ ఇస్తామని, గిఫ్ట్ ప్యాక్ లు వచ్చినాయి అని, తక్కువ రేట్‌కి వాహనాలు దొరుకుతాయని, ఎవరైనా పై అధికారి వాట్సాప్ డీపీ పెట్టుకుని వాట్సాప్ లో మెసేజ్ చేసి డబ్బులు పంపమని అడిగితే పంపరాదు అని, మొబైల్ ఫోన్లో బ్లూ లింక్స్ ఓపెన్ చేయరాదని, ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పరాదని మొదలగు మోసపూరిత ఆశలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని అనుకోకుండా సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, పిసి హన్మంతు, ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## క్రీడాకారులు కోచ్‌కు అభినందనలు


**మక్తల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో జరుగుతున్న సీఎం కప్ పోటీలలో నారాయణపేట జిల్లాకు చెందిన 12 మంది బాలికలు, 12 మంది బాలురు సైక్లింగ్ విభాగంలో పాల్గొని చక్కని క్రీడా ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా ఆదివారం మహేశ్వరంలో క్రీడాకారులను, వారికి శిక్షణ అందించిన కోచ్ బి.గోపాలంను సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ. మల్లారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత రాజాగౌడ్, సైక్లింగ్ అసోసియేషన్ కోశాధికారి సతీష్ గౌడ్ చేతుల మీదుగా శాలువాలతో సన్మానించి, ప్రత్యేకంగా అభినందించారు. నారాయణపేట జిల్లా నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా 24 మంది క్రీడాకారులు సైక్లింగ్ పోటీలకు హాజరు కావడం గర్వకారణమని, మున్ముందు వీరిని మరింత ప్రోత్సహించేందుకు ముందుంటామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీలు విష్ణువర్ధన్, నరేష్, ఈశ్వర్, శ్రీలత, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను,కోచ్‌ను అభినందిస్తున్న దృశ్యం

## చౌదర్‌పల్లిలో ఘనంగా ఉర్సు ఉత్సవాలు

**దేవరకద్ర,డిసెంబరు 28 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలో కొలువుదీరిన హజ్రత్ మదారుషా అసహాది దర్గా ఉర్సు వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. చౌదర్ పల్లి లోని ఈ దర్గా నుమతసామరస్యానికి ప్రతీక నిలిచింది. ప్రతి ఏడాది గ్రామ సమీపంలోని హజ్రత్‌మదారుషా అసహాది దర్గా ఉర్సు వేడుకలను గ్రామస్థులు కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ ఉర్సు వేడుకలను గ్రామస్థులు, నిర్వహకులు నిర్వహించారు. ధూలేశ్వర భక్తబృందం,గ్రామస్థులు, భక్తుల అధ్వర్యంలో ఈ ఉర్సు వేడుకలు జరిగాయి. ఉర్సు ఉత్సవాలలో భాగంగా గంధోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. గలీఫా,పూల ఛాదర్‌లచే దర్గాపై కప్పి ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. అలాగే ఖవ్వాలి కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు.దర్గాలో ఖతం ఫాతెహా,ఖరాన్ సలాం,శ్రీవారి మహాప్రసాదం,భోజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. చౌదర్‌పల్లి, హాజిలాపూర్ గ్రామాల భక్తులచేత ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా సాహెబ్ సామదిని రకరకాల పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.



దర్గాలో ఫాతెహా ఇస్తున్న బక్తులు

## సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపిన ఉద్యోగులు

**గద్వాల,డిసెంబరు 29 ప్రభాతవార్త :** ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెలో భాగంగా ఆదివారం వినూత్న రితిలో మహిళా ఉద్యోగులు చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. దీక్షా కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేతులకు తాడు కట్టుకొని మా యొక్క డిమాండ్స్ నెరవేర్చాలని చేతులకు తాడు కట్టుకున్నట్లు ఉద్యోగులు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు,మా సమ్మెకు మద్దతు తెలపడం జరిగిందిన్నారు. అదేవిధంగా అన్ని కేజీబీవీ ల నుండి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, యూఆర్, స్పెషల్ ఆఫీసర్ శేషన్న గ,సి.ఆర్.టి.లు. పీజీసీఆర్టీలు, నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా ఈ సమ్మెలో పాల్గొనడం జరిగింది. డీపీఓ వింగ్ అధ్యక్షుడు డిఎల్ఎంటి అధ్యక్షులు బి రామాంజనేయులు, మిస్ వింగ్ అధ్యక్షుడు శ్రీధర్, సీసీఓ వింగు అధ్యక్షుడు ఆల్తాఫ్, సీఆర్పీ వింగ్ అధ్యక్షుడు ఎంఎ సమీ, ఐఈఆర్పి వింగ్ అధ్యక్షుడు మురళి, పిటిఐ వింగ్ అధ్యక్షుడు రాజేందర్ రోజువారిగ వీరు పాల్గొంటున్నారు. అదేవిధంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు హుసేనప్ప ,జేఏసీ ప్రధాన కార్యదర్శి గోపాల్ ,కేజీబీవీ మహిళా అధ్యక్షురాలు ఎస్పీ ప్రణిత, సమగ్ర శిక్ష లోని అన్ని వింగుల అధ్యక్షులు పాల్గొని గురువారం నిరవధిక సమ్మెను విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొనడం జరిగింది. ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి గా హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చెయ్యాలి. అప్పటి వరకు పే స్కేల్ అమలు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రణిత, శ్రీదేవి, స్రవంతి, గోపాల్, రామంజనేయులు, బహద్దూర్, అల్తాఫ్, సమీ, షేసన్న,అధ్యక్షులు హుసేనప్ప తదితరులు పాల్గొన్నారు.




చేతులకు తాడు కట్టుకొని నిరసన తెలిపిన ఉద్యోగులు

# తిరుచ్చివాహనంపై ఊరేగిన వెంకటేశ్వరస్వామివారు

**- అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారు -స్వామివారిని దర్శించుకొని తరించిన భక్తులు**

**దేవరకద్ర,డిసెంబరు 29 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను ధక్షిణకట్ట వరకు నిర్వహించారు. అక్కడ కూడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళీ గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.



స్వామి వారికి హారతి ఇస్తున్న మధుసూధన్‌కుమార్

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు.రకరకాల పూలు,బంగారుఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్య క్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

**కొత్తకోట డిసెంబరు 29 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణంలోని భారతి విద్యా మందిర్ స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నంత పాఠశాల ఆవరణంలో గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే దు ఇండియా ఆధ్వర్యంలో బెల్టు గ్రేడింగ్ టెస్ట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు దాదాపు 50 మంది విద్యార్థినిలు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి బెల్ట్ సర్టిఫికెట్లు సాధించారు. వీరిలో ఫండమెంటల్ బేసిక్స్ కిక్ కటాస్ లెగ్ లిఫ్టింగ్ మరెన్నో విభాగాలలో చక్కటి ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ విద్యా మందిర్ హై స్కూల్ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఏజాజ్ అలీ, కరాటే పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థి విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులో విద్యార్థులు కరాటే శిక్షణ తీసుకోవడం చాలా మంచిదని విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రోత్సహించాలని కోరారు. భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉంటూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కరాటే లో పాల్గొని ప్రతిభ చాటాలని కోరారు. తదనంతరం సర్టిఫికెట్స్ పొంది అవి ప్రభుత్వ ఉద్యోగాలలో 2, 5 రిజర్వేషన్ ఉన్నది దీని ద్వారా విద్యార్థులు పై చదువులకు ప్రభుత్వ ఉద్యోగాలలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించుకోవచ్చని తెలియజేశారు. కరాటే నీ ప్రభుత్వం చాలా ప్రోత్సహిస్తుందని కాబట్టి తల్లిదండ్రులు అందరు కూడా విద్యార్థులకు కరాటే శిక్షణపై మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులకు శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ విద్యార్థులకు శిక్షణ ఇచ్చినటువంటి భారతీయ విద్యా మందిర్ హై స్కూల్ బ్రాంచ్ మాస్టర్ ఇంతియాజ్ ప్రభుత్వ బాలికలు ఉన్నంత పాఠశాల మాస్టర్స్ జాఫర్ సాదిక్ జి హరీష్ యాదవ్ లను ప్రత్యేకంగా అభినందించినట్లు క్లబ్బు ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. విరుతోపాటు క్లబ్ సీనియర్ మాస్టర్స్ ఇఫ్తార్, రఫీ ఖాద్రీ, వెంకటేష్ ప్రుథ్వీరాజ్, అనిత రెడ్డి, జే.సుమ, మంజునాథ్, వడ్డే శివరాజ్, జి పరమేష్, శంకర్, అరవింద చారి, అంజి, జాంగిర్, ఎండి రియాజ్, బి కురుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులు

## హామీ ఇచ్చిన ప్రతి కార్మికునికి ఉపాధి కల్పించాలి

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ జీ. రంజిత్ కుమార్**

**గద్వాల, డిసెంబరు 29 ప్రభాతవార్త :** గద్వాల మండలంలోని పూడూరు దగ్గర ఉన్న గోదాములలో పని కల్పిస్తామని పూడూరు, ఎర్రవల్లి,జమ్మిచేడు, మేలచెరువు,జంగంపల్లి,కొండపల్లి తదితర గ్రామాలలో సుమారు 600 మందికి పైగా 40 వేల నుండి లక్ష రూపాయల దాకా స్థానిక గోదాములు ప్రారంభమవుతే అందరికీ పని కల్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశారని, ప్రస్తుతం వీరికి కాకుండా వేరే రాష్ట్రానికి సంబంధించిన వారికి ఉపాధి కల్పించారని అన్నారు. వెంటనే స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. త్వరలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 600 మంది కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి వారి ఐక్యతతో ఉండేలా యూనియన్ ఏర్పాటు చేయాలని వారి సమస్యలు పరిష్కారం చేసుకోవడానికి వారు పోరాడతారని అన్నారు. అనేక రాజకీయ కుట్రలతో ఇన్ని సంవత్సరాలు గోదాములను నడవకుండా చేశారని ప్రస్తుతం అన్ని సమస్యలను పరిష్కారం చేసుకొని చట్టబద్ధంగా ప్రారంభమైన గోదామును కొంతమంది కుట్రతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. న్యాయపరంగా, సక్రమంగా ఉన్నప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రత్యక్షంగా,పరోక్షంగా రెండు వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని, అట్లాంటి గోదామును కేవలం రాజకీయ కుట్రతో అడ్డుకోవడం తగదని అన్నారు. గతంలో స్థానిక గ్రామాలకు చెందిన కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడి ఇక్కడ గోదాము వస్తే మాకు పని కలుగుతుందని ఆశతో డబ్బులు కట్టి 14 సంవత్సరాలు కావస్తున్న, మాకు ఉపాధి లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. త్వరలో కార్మికులతో పాటు రవాణా కు చెందిన అసోసియేషన్ వారితో కూడా సమావేశాన్ని ఏర్పాటు చేసి వీరికి ఉపాధి కల్పించేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. జిల్లాలోనె అత్యధికంగా ఉపాధి కల్పించే ఈ గోదాములను కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా స్థానికులకు అందరికీ ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబుతోపాటు కార్మికులు ఎర్రవల్లి బాలరాజు, రాముడు, పూడూరు బాబు, మేల చెరువు దేవకుమార్,పుడూరు ధోని, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు విష్ణు,ప్రేమ్ రాజ్, రంగస్వామి,చిన్న రాముడు, లక్ష్మన్న,సర్వేశ్,రమేష్,భూపతి, సర్వేశ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

## సమసమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర

**బిజినేపల్లి,డిసెంబరు29 ప్రభాతవార్త:** సమసమాజ నిర్మాణంలో గాంధీ కంటే ముందే మహాత్మునిగా జన నీరాజనాలందుకున్న విశిష్ట మూర్తి జ్యోతిరావు పూలే అని పూలే విగ్రహ ఆవిష్కరణ చైతన్య కమిటీ గౌరవ సలహాదారు అంతటి రాజేందర్ గౌడ్ అన్నారు. నంది వడ్డేమాన్, పాలెం గ్రామాల్లో బీసీ కమిటిలను ఎన్నుకున్నారు. ఆయా గ్రామాల్లో కమిటీలను ఉద్దేశించి రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ సత్యం సమానత్వం అన్న సూత్రాల ఆధారంగా నూతన సమాజాన్ని ఏర్పాటు చేయడానికి సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను జ్యోతిబాపూలే స్థాపించారని అన్నారు. దేశమనే దేహానికి శూద్రులు ప్రాణం, రక్తనాళాల లాంటి వాళ్ళు అని చెప్పాడు. హిందూ సమాజంలో అగ్రకులాల వారి బానిసలుగా బతుకుతున్న కింది కులాల వారిలో తమ బానిసత్వం పట్ల ఆయన చైతన్యం రగిలించిన వ్యక్తిగా కొనియారు. కుల వ్యవస్థను బానిసత్వం గా పరిగణిస్తూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా గులాంగిరి వంటి ఎన్నో పుస్తకాలు రాశాడన్నారు. నిమ్న కులాల వాళ్లలో ఆత్మవిశ్వాసం ఆత్మగౌరవం పెంపొందించే విధంగా జ్యోతిబా పూలే ఎంతో కృషి చేశారన్నారు. కులం పేరుతో తరతరాలుగా అన్నిరకాలుగా అణచివేతలకు వివక్షతకు గురైన బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతి రావు పూలే చెప్పారు.శతాబ్దాలుగా అణచి పెట్టబడి ఉన్న కింది కులాల గురించి ఆలోచించిన మొదటి నాయకుడు పూలే అని సాంఘిక సమానత్వం, సామాజిక న్యాయం అంటూ ఆలోచించి ప్రబోధించి దళిత వర్గాలను, బలహీన వర్గాలను జాగృతం చేసిన క్రియాశీలి అని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో పూలే విగ్రహ ఆవిష్కరణ చైతన్య కమిటీ మండల నాయకులు వెంకటస్వామి,రఘు బాబు,వేముల సత్యశిలా సాగర్, భగవంతగౌడ్ ,కల్మూరి చిన్నయ్య, రామన్ గౌడ్, వంగ దామోదర్ గౌడ్ ,కదారి వెంకటయ్య, అస్కాని రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నంది వడ్డేమాన్‌లో బీసీ కమిటీని ఎన్నుకుంటున్న మండల నాయకులు

## భువనచంద్రచే జ్ఞాపికనందుకున్న భూత్పూర్ ఉపాధ్యాయుడు యాదయ్య

**భూత్పూర్,డిసెంబరు 29,ప్రభాతవార్త :** ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్రచే భూత్పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యుడుగా పనిచేస్తున్న పీఆర్‌టీయు టీఎస్ రాష్ట్ర అసోసి యేట్ అధ్యక్షుడు కొప్పోలు యాదయ్య శనివారం జ్ఞాపికను అందు కున్నారు.ఎపిలోని విజయవాడలో ఈ నెల 28,29తేదిలలో 6వ ప్రపంచ తెలుగు మహాసభలో పాల్గొన్న భువనచంద్ర సభలో యాదయ్య మూడవ వేదికలో కవిసమ్మేళనంలో కవితను కవితా రూపంలో చదివి వినిపించినందుకుగాను భువనచంద్ర అభినంది స్తూ జ్ఞాపికను అందజేసినట్లు కొప్పోలు యాదయ్య తెలిపారు.




సినీ గేయరచయిత భువనచంద్రచే జ్ఞాపికను అందుకుంటున్న భూత్పూర్ పీఎస్ ఉపాధ్యాయుడు కొప్పోలుయాదయ్య

## విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడుగా కాకునూరి



నియామక పత్రం అందుకుంటున్న దృశ్యం

**ఉప్పునుంతల, డిసెంబరు 29 ప్రభాతవార్త :** అఖిల భారతీయ విశ్వ కర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడుగా కాకునూరి బ్రహ్మాచారి ఎంపికయ్యారు. మండలంలోని తాడూరు గ్రామానికి చెందిన కాకునూరి బ్రహ్మాచారిని హైదరాబాద్‌లో అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాలచారి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కాకునూరి బ్రహ్మాచారి మాట్లాడుతూ రాష్ట్ర విశ్వకర్మ పరిషత్ నాపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతనువారి నమ్మకాని వోమ్ము చేయకుండా తుచ తప్పాక నిర్వహిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో అసంఘటిత కార్మికశాఖ విశ్వకర్మ సెల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చింతోజు చెన్నయ్య చారి, బొడ్డు పల్లి చరణ్, విశ్వ హిందూ పరిషత్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు తేజస్విని,జనసేన పార్టీ లింగం పల్లి కన్వీనర్ దంతోజు ఇందుమతి, దేవ పూజ ఈశ్వరచారి, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



పూజలో పాల్గొన్న స్వాములు

**మహబూబ్‌నగర్,డిసెంబరు 29 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు పరిధిలోని తిమ్మసానిపల్లిలో శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం బీసీ కాలనీ ఆంజనేయ స్వామి నుంచి కలశం ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం తిమ్మసానిపల్లి ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఏర్పాటు చేసిన మహా పడిపూజ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు. తిమ్మసానిపల్లి అయ్యప్ప సేవా సమాజం ద్వారా అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు.

## శరవేగంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే



ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**మద్దూర్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శరవేగంగా ఇంది రమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతుంది.ఈ సందర్భంగా ఆదివారం ఎంపీడీవో నరసింహారెడ్డి ప్రత్యేకంగా మోమినాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పర్యవేక్షించారు. మోమి నాపూర్ గ్రామంలో మొత్తం 559 కుటుంబాలకు గాను 350 కుటుంబాలకు సర్వే నిర్వహించినట్టు ఎంపీడీవో నరసింహారెడ్డి తెలిపారు.ఈకార్యక్రమంలో మద్దూరు మండల పిఏసిఎస్ చైర్మన్ నర్సింలు మమ్మీనాపూర్ గ్రామ కార్యదర్శి చిన్న బాల్‌రాజ్ మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


## కుర్వసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కుర్వసంఘం నాయకులు

**దేవరకద్ర,డిసెంబరు 29 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఆదివారం హైద్రాబాద్ కులపెద్దల అధ్వర్యంలో కుర్వసంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మలక్‌పేట మార్కెట్ డైరెక్టర్ జెట్రం కృష్ణ, సంఘం నాయకులు రాంపండు,కేవి.రాజు ,శ్రీను స్వామి,కురుమూర్తి దేవస్థానం డైరెక్టర్ గౌనిరాము,గౌని శ్రీను,జె ట్రం బీరప్ప,అశోక్,పట్నంరవి,జెట్రం శ్రీను,కడప తిమ్మన్న,పెద్ద తిమ్మన్న,ఇనుపసామాను తిమ్మన్న,హోటల్ చిన్నప్ప,దాను,తిమ్మన్న,నాగరాజు,కృష్ణ,నరసింహ్ములులతో పాటు వందమంది కురువసంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరచింతలో ఈనెల 31న ఉచిత వైద్య శిబిరం




ఉచిత వైద్య శిబిరం విజయవంతం చేయాలని ప్రచారం

**అమరచింత డిసెంబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా ఈనెల 31న మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్ తెలిపారు. ఆదివారం అమరచింత మండల కేంద్రంలోని ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం బ్యానర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య రెడ్డి మాట్లాడుతూ, మండలంలోని ప్రజలు గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నెల 31న శ్యాముల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ జి ప్రణయ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని ఈ శిబిరానికి మండలంలోని ప్రజలు భారీగా పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## ఎకోక్యూర్ యాప్ తయారు చేసిన శ్లోక విద్యార్థులు

**జడ్చర్ల, డిసెంబరు 29 ప్రభాతవార్త:** జడ్చర్లలోని శ్లోక పాఠశాలకు చెందిన జీవన్ నంజేశ్ ఎకోక్యూర్ పేరుతో యాప్‌ను తయారు చేశాడు. షైన్, సుహాస్, రేషి, సాత్విక్ సహకారంతో తయారుచేసిన యాప్ వల్ల ఎకో ఫ్రెండ్లీ సొసైటీని తయారు చేయవచ్చని విద్యార్థులు చెబుతున్నారు. ఈ యాప్‌లో విద్యార్థులు ఇతరులు కూడా తమకు తోచిన ఐడియాలను షేర్ చేసుకోవచ్చని చెప్పారు. యాప్ ద్వారా పలు ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టవచ్చని సూచించారు. ఈ మేరకు ఆప్ తయారు చేసిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులు కూడా అభినందించారు.



ఎకోక్యూర్ యాప్ గురించి వివరిస్తున్న విద్యార్థి

## పేట శక్తిపీఠం ఆధ్వర్యంలో 2025 డైరీ ఆవిష్కరణ

**నారాయణపేట టౌన్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రం శక్తిపీఠం వ్యవస్థాపకులు పూజశ్రీ స్వామి శాంతానంద పురోహిత్ ఆశీస్సులతో ఆదివారం శక్తి పీఠం నారాయణపేట వారి ఆధ్వర్యంలో 2025 డైరీని ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ శక్తిపీఠం ఆధ్వర్యంలో ముద్రించబడిన నూతన సంవత్సర తెలుగు డైరీలను పలువురు కొనుగోలు చేశారు. మన సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో తిథులతో, పంచాంగ వివరాలు, హిందూ పండుగలు వివరాలతో కూడిన తెలుగు డైరీని ముద్రిచడాన్ని పలువురు అభినందించారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో శక్తి పీఠ వ్యవస్థాపకులు పూజ శ్రీ స్వామి శాంతానంద పురోహిత్‌తో బాటు తదితరులు ఉన్నారు.




శక్తిపీఠం డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## కరాటే విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే

**మక్తల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** ఈనెల 30 నుంచి జనవరి 3 వరకు జరిగే సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి శాలువాలతో సన్మానించి, క్రీడా దుస్తులను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లోనూ సత్తా చాటి పతకాలను సాధించాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ జి.బాలకృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హనుమంతు, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి, కరాటే క్లబ్ వ్యవస్థాపకులు సలాంబిన్ ఉమర్, కరాటే మాస్టర్లు అమ్రేష్, అంజన్ ప్రసాద్, సలీం, వెంకటేష్, శేఖర్, మోనిక తదితరులు పాల్గొన్నారు.



కరాటే విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే

## మహా పడిపూజకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**మక్తల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయం వద్ద జనవరి 1న జరిగే 42వ మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ అశోక్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరిని అయ్యప్ప భక్తులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యేను తన నివాసంలో ప్రత్యేకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మహా పడిపూజలో పాల్గొనే అయ్యప్ప స్వామి భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, శివరాం గురుస్వామి, నీలగౌడ్ గురుస్వామి, ఒబ్లాపూర్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అయ్యప్పస్వాములు

## ఉమ్రా యాత్రికులకు చైర్మన్ ఘన సన్మానం

**భూత్పూర్,డిసెంబరు 29,ప్రభాతవార్త :** ముస్లింలు ఎంతో పవిత్ర యాత్రా స్థలంగా భావించే మక్కా మదీనా దర్శనాల కోసం ఈ నెల 31న ఉమ్రా యాత్రకు బయలుదేరే భూత్పూర్ బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు ఎండి ఖదీర్ సతీమణి తాహెరా బేగం వారి కుటుంబ సభ్యులు జహంగీర్‌బీ, జిలానీ,రఫికాబేగం, నజ్మాబేగంలను శనివారం రాత్రి భూత్పూర్ పట్టణంలోని ముస్లిం కమ్యూనిటీ భవన్‌లో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.వీరి పవిత్ర మక్కా యాత్ర సాఫీ జరగాలని చైర్మన్ తన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ వీడ్కోలు సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్,సత్తూర్ అశోక్‌గౌడ్,సత్తూర్ సురేష్‌గౌడ్,సత్తూర్ సదానంద్‌గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు మొహ్మద్ సాధిక్,మొహ్మద్ ఆహ్మద్,మొహ్మద్ షేక్ యాసిన్,మొహ్మద్ ఆఫ్సర్,మొహ్మద్ ఖదీర్,రఫీవుల్లా,మొహ్మద్ ఖాన్,మొహ్మద్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



యాత్రికులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

**దేవరకద్ర, డిసెంబరు 29 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. దేవరకద్రలో సర్వర్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దేవరకద్రకు వచ్చి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తమ్ముడు హనుమంత్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో హనుమంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే గద్దెగూడెంలో మృతి చెందిన గొల్ల తిరుమలయ్య, వెంకటమ్మ కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్ కుమార్ రెడ్డి, దేవరకద్ర, కౌకుంట్ల మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజిల్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మికాంత్ రెడ్డిలతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గుడిసె దగ్ధం

**కల్వకుర్తి,డిసెంబరు29 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామ పంచాయితీ పరిధిలో గల తాండలో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రాత్లవత్ సీత్యా గుడిసె దగ్దమైంది. సీత్యా తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా అయన గుడిసెలో నుంచి పొగలు రావడాన్ని గమనించిన తండావాసులు నీళ్ళు చల్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న సీత్య వచ్చేసరికి గుడిసె పూర్తిగా దగ్ధమైంది.కల్వకుర్తినుంచి వచ్చిన ఫైర్ఇంజన్ సిబ్బందివారికి సహాయం అందించారు. గుడిసెలో ఉన్న ధాన్యం, బియ్యం, బట్టలు,నగదు, భూమి, ఆధార్ ఇతర సర్టిఫికెట్లు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు.



# విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

### పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకటరెడ్డి

**వనపర్తి టౌన్ డిసెంబరు 29 ప్రభాతవార్త :** దేశంలో ప్రభుత్వ విద్యా రంగం మొత్తం కూడా నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయనీ పి డి ఎస్ యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకటరెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో యాదవ సంఘం భవనంలో ఆదివారం పి డి ఎస్ యు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం కె పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రీన్ సుల్తానా మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ విద్యా రంగం మొత్తం కూడా నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నయనీ అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 తీసుకొచ్చి విద్యారంగాన్ని మొత్తం కూడా కాషాయకరణ చేస్తూ కార్పొరేట్, ఎమ్మెల్సీ కంపెనీలకు విద్యారంగాన్ని అప్పజెప్పిందన్నారు. విశ్వవిద్యాలయంలో మతం పేరుతో కులం పేరుతో విద్యార్థుల మధ్య చిచ్చు పెడుతూ విద్యార్థినిలపై మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో విద్యాశాఖ కి కనీసం విద్యాశాఖ మంత్రి కూడా కేటాయించకుండా విద్యారంగం పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న శిత్తశుద్ది అర్థమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7800 కోట్లకు పైగా పెండింగ్ స్కాలర్షిప్స్ ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతుందనీ విమర్శించారు. యూనివర్సిటీలలో ఖాళీలను భర్తీ చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్స్ కు సొంత భవనాలు నిర్మించాలని సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాయ్యన్న, రాజు, వెంకటేష్ గౌడ్, యశ్వంత్, గణేష్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




జనరల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకట్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు

# వైభవంగా బాల్యమిత్రుల సిల్వర్ జూబ్లీ వేడుకలు

**25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న బాల్య మిత్రులు**

**చదువు చెప్పిన గురువులకు ప్రత్యేక సన్మానం**

**నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్న పూర్వ విద్యార్థులు**

**ఉప్పునుంతల,డిసెంబరు 29 ప్రభాతవార్త :** చిన్ననాటి నుంచి కలిసి మెలిసి ఆడుతూ పాడుతూ మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి వివిధ హోదాలలో ఆయా ప్రాంతాలలో స్థిరపడిన బాల్యమిత్రులు 25 సంవత్సరాల తర్వాత కలుసుకొని సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం మండల కేంద్రంలోని కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో వైభవంగా నిర్వహించుకున్నారు. సెలవు దినమైన ఆదివారం రోజు ఈ కార్యక్రమానికి స్థానిక పూర్వ విద్యార్థులు నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేసి తోటి మిత్రులతో సిల్వర్ జూబ్లీ వేడుకలలో తమకు చదువు చెప్పిన గురువులకు ప్రత్యేకంగా సన్మానం చేశారు. ఉదయం టిఫిన్ మొదలుకొని మధ్యాహ్న భోజనం సాయంత్రం స్నాక్స్ వరకు అన్ని కార్యక్రమాలు ఆసక్తికరంగా నిర్వహించుకుని వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో తమకు చదువు చెప్పిన గురువులకు పూలమాలలు ,శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ప్రత్యేక వంటకాలతో భోజనాలను ఏర్పాటు చేశారు. నాటి ఉపాధ్యాయులు తమకు సరైన మార్గ నిర్దేశం చేసినందువల్లే తాము జీవితంలో స్థిరపడినట్లు పలువురు వెల్లడించారు. సిల్వర్ జూబ్లీ వేడుకలలో భాగంగా ప్రత్యేక హోదా పోటీలను నిర్వహించారు.ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు బాల్యమిత్రులలో ఆర్థిక ఇబ్బందులను ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోమని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గురువులు విశ్వనాథం,సత్యపాల్ రెడ్డి, కాశన్న, హనుమంత్ రెడ్డి, ఇస్రాత్ బేగం, 1999 ఎస్ఎస్సి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



1999 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు

# ట్రస్మా ఎన్నికలకు పాలమూరులో సాఫీగా ఆన్‌లైన్ ఓటింగ్

**భూత్పూర్,డిసెంబరు 29,ప్రభాతవార్త :** ట్రస్మా ఎన్నికలకు ఎవరెన్ని పన్నాగాలు పన్నినా,ఆటంకాలు కల్పించినప్పటికి జిల్లా వ్యాప్తంగా ట్రస్మా కుటుంబ సభ్యులు ఆదివారం నిర్భయంగా ఆన్‌లైన్ ఓటింగ్‌లో పాల్గొని ట్రస్మా ఐక్యతను చాటారని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. జిల్లాలో దాదాపుగా 150వరకు ట్రస్మాలో రిజష్టరైన ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల కరస్పాండెంట్లు ఎన్నికల అధికారి ఆదేశానుసారం ఆన్‌లౌన్ ఓటింగ్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు.రాష్ట్ర ట్రస్మా ఎన్నికలను ఆపేందుకు కొందరు విశ్వప్రయత్నాలు చేశారని,కమిషన్‌కు వెళ్లి ఎన్నికలను నిలిపివేయాలని ఫిర్యాదు చేశారని,అయితే ఆన్‌లైన్ ఓటింగ్‌ను ఆపలేమని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ఏకతాటిపై ఉన్న ట్రస్మాను కొందరు సీనియర్లు ట్రస్మాలో ఉంటూ తమ స్వార్థ ప్రయోజనాల కోసం ట్రస్మాను మూడు ముక్కలు చేసేందుకు ప్రయత్నించారని విమర్శించారు.జిల్లా ట్రస్మా సభ్యులు మాత్రం ఎవరి ప్రలోభాలకు లొంగకుండా,వారి మాయమాటలకు మోసపోకుండా నిర్భయంగా,సజావుగా ఆన్‌లైన్ ఓటింగ్‌లో పాల్గొన్నట్లు తమకు సభ్యులు చరవాణి ద్వారా సమాచారమందించారన్నారు.న్యాయబద్ధంగా ఓటింగ్ ద్వారా ట్రస్మా సభ్యులు ఎవరిని గెలిపించినా ట్రస్మా రాష్ట్రంలో విడిపోకుండా ఏకతాటిపై ఉండాలన్నదే తమ ధ్యేయమని లక్ష్మణ్ పేర్కొన్నారు.

# వెయ్యి సంవత్సరాల గణపతిని కాపాడుకోవాలి

**ఖిల్లాఘణపురం డిసెంబరు 29 ప్రభాతవార్త :** వెయ్యి సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన సిద్ధి గణపతి విగ్రహాన్ని కాపాడుకోవాలని పురావాస్తు పరిశోధకులు ప్లీజ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏడు కోట్ల సమీపంలో ఉన్న పురాతన గణపతి విగ్రహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వారసత్వ సంపదను గుర్తించి స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన ఆదివారం నాడు ఘణపురం పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ క్రమంలో ఘన్పూర్ పట్టణానికి పశ్చిమంగా మూడు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయ పొలాలలో గల ఒక పెద్ద గుండు పై ఐదు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పు 6 అంగుళాల మందంతో రాతిని తులసి పెద్ద గణపతి విగ్రహాన్ని పరిశీలించారు. తలపై జటా మకుటం గజముఖం ఎడమ వైపుకు తిరిగిన తొండం పై రెండు చేతుల్లో పరశు, పాశం, గల విగ్రహాన్ని వనపర్తి జిల్లాలోని అతి పెద్దదైన ఈ గణపతి విగ్రహం క్రీస్తు శకం 11వ శతాబ్ది నాటి కందూరు చోళుల తోలి కాలపు ప్రతిమ లక్షణాన్ని తెలియజేస్తుందని శివనాగిరెడ్డి చెప్పారు. చారిత్రక ప్రాధాన్యత గల ఈ విగ్రహాన్ని కాపాడుకోవాలని జిల్లా ఘణపూర్ కు చెందిన వనపర్తి జిల్లా విశ్వహిందూ పరిషత్ సేవ ప్రముఖ బెస్త శ్రీనివాస్, ఆగారం ప్రకాష్, ఆకారం శేఖర్ రెడ్డి, ఎండి పాషాలకు విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పట్నం కృష్ణం రాజు పాల్గొన్నారు.



పురాతన గణపతి విగ్రహాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శివ నాగిరెడ్డి

# జ్ఞాన సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

**సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు విజయవంతం చేద్దాం: సీనియర్ స్వేరో దుబ్బ నాగేష్**

**కల్వకుర్తి, డిసెంబరు 29 ప్రభాతవార్త:** జ్ఞాన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీనియర్స్ స్వేరో దుబ్బ నాగేష్ పేర్కొన్నారు. ఆదివారం కల్వకుర్తి ఆర్ అండ్ బి అతిథి గృహంలో నాగర్‌కర్నూలు జిల్లా స్వేరో ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీనియర్స్ స్వేరోస్ దుబ్బ నాగేష్, ఎదిరి మల్లేష్, బుద్దుల రామకృష్ణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే జనవరి 3న పరకాలలో నిర్వహించే మాత సావిత్రిబాయి పూలే జయంతిని విజయవంతం చేసేందుకు జిల్లాలోని స్వేరోస్ అందరు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. అక్షరం ఆర్థికం ఆరోగ్యం అనే ప్రధాన లక్ష్యాలతో స్వేరో ఆర్గనైజేషన్ ముందుకు సాగుతుందని వారు పేర్కొన్నారు. సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జ్ఞాన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానానికి ఆశయానికి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ నిరంతరం కృషి చేస్తున్నారని వారు సందర్భంగా పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు వడ్డేమాన్ మోహన్ కుమార్, జిల్లా సోషల్ మీడియా కమాండర్, సంపత్‌కుమార్, సీనియర్ స్వేరోస్ నాయకులు పోలే, శేఖర్, పదర మండల ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ స్వేరో దుబ్బ నాగేష్

# రోడ్డు ప్రమాద నిబంధనలు కచ్చితంగా పాటించాలి

**వెల్దండ, డిసెంబరు 29 ప్రభాతవార్త:** రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు రోడ్డు ప్రమాద నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్సై కురుమూర్తి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై ఆదివారం జిల్లా ఎస్పీ సూచన మేరకు ఎస్సై కురుమూర్తి తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, ప్రమాదాలు జరగకుండా సూచించిన స్పీడ్ మేరకే డ్రైవింగ్ చేయాలని, సీటు బెల్టు తప్పనిసరి, మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అతివేగం ప్రమాదకరమని అన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

## కొత్తపల్లి బోనమ్మ దేవాలయంలో చోరీ



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**మద్దూర్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** కొత్తపల్లి బోనమ్మ దేవాలయంలో శనివారం రోజు రాత్రి గుర్తు తెలియని కొందరు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు మద్దూర్ ఎస్సై రామ్‌లాల్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఉమ్మడి మద్దూరు మండలం పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం రాత్రి భువనమ్మ దేవాలయంలో రూ. 15 వేల ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మద్దూర్ ఎస్సై తెలిపారు.

## మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ



అశోక్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

**దేవరకద్ర,డిసెంబరు 29 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం ఇస్రంపల్లిలో ఇటీవల మృతి చెందిన అశోక్ కుటుంబసభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు.మృతుడు అశోక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు చందూగౌడ్,మాజీ సర్పంచ్ సకిలాల శివరాజ్ నాయకులు కిష్టన్న,బాబుజాని,హర్షవర్ధన్,రఘులతో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ కళాశాల లెక్చరర్ మహమ్మద్ అలీ మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం సమీపంలోని బీసీ గురు కుల డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్ గా విధులు నిర్వహిస్తు న్న మహమ్మద్ అలీ(38) గుండెపోటు తో మృతి చెందారు. తెల్ల వారు జామున నైట్ డ్యూటీ అనంతరం అక్కడే మార్నింగ్ వాకింగ్ చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటుతో పడిపోయారు. అతడి ని చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించిగా మహమ్మద్ అలీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధా రించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఉంది. మహమ్మద్ అలీ మృతికి పలువురు సంతాపం తెలిపా రు. విషయం తెలుసుకున్న విద్యార్థులు జిల్లా ఆసుపత్రి వద్ద భారీ సంఖ్యలో చేరుకొని నివాళులు అర్పించారు.



## అదుపు తప్పి కారు బోల్తా ఒకరికి స్వల్ప గాయాలు

**పెబ్బేరు డిసెంబరు 29 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలోని జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తాపడి ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గా జిల్లా, షాదీపూర్ గ్రామానికి చెందిన సచిన్, లత దంపతులిద్దరూ బెంగుళూరుకు వెళ్తుండగా పట్టణంలోని జాతీయ రహదారి హైదరాబాద్ బైపాస్ దగ్గర కారు అదుపు తప్పి పక్కకు దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న లత స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే 108 అంబులెన్స్ వారికి సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స నిర్వహించి కర్నూలు ఆస్పత్రికి తరలించారు.



## గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

**కాంగ్రెస్ పార్టీ పేట జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు శివకుమార్‌రెడ్డి**

**నారాయణపేట టౌన్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం దామరగిద్ద మండలం క్యాతన్ పల్లి గ్రామంలో సునంద ఆసుపత్రి సహకారంతో జిల్లాస్థాయి క్రికెట్ నిర్వహించారు. విజేతలైన టీంలకు కుంభం శివకుమార్ రెడ్డి చేతుల మీదుగా కప్పులను అందజేశారు. ఫైనల్‌లో బాపన్‌పల్లి టీం , మద్దెల్ బీడ్ టీం లు పోటీ పడగా మొదటి బహుమతి బాపనపల్లి గ్రామం కైవసం చేసుకోగా రెండో బహుమతి మద్దెల్ బీడ్ టీంకు దక్కింది. అంతకుముందు ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రామస్థాయి క్రీడలకు పరిమితం కాకుండా జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచాలన్నారు. ప్రతినిత్యం క్రీడలు ఆడడం వలన ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. ప్రతి విద్యార్థి చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్ రెడ్డి, బసుదే లక్ష్మణ్, శరణ్ నాయక్, శ్రీనివాస్, శరత్, లాలప్పతో పాటు తదితరులు ఉన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

## చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

**కల్వకుర్తి, డిసెంబరు 29 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలో చిరు వ్యాపారులకు అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసే గొడుగుల పంపిణీ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం చేతుల మీదుగా 50 మంది రోడ్డు పక్కన గల చిరు వ్యాపారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యం మాట్లాడుతూ ఎండకు, వర్షానికి చిరు వ్యాపారులకు ఈ గొడుగులు ఎంతో దోహద పడతాయన్నారు. చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేసిన అభయ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, మాధవరెడ్డి, వెంకటయ్య, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## తోటపల్లి వాసుకి ఎల్ఎల్ఎం ప్రధానం చేసిన ఉస్మానియా వీసి కుమార్

**కల్వకుర్తిరూరల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన బుడుమ ఉమాపతి న్యాయ శాస్త్రంలో ఎల్ఎల్ఎం పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాసీంలు ఉమా పతికి ఎల్ఎల్ఎం పట్టాను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఉమాపతి ఎల్ఎల్ఎం పట్టా అనుకోవడం అభినందనీయమని, గ్రామీణ ప్రజలకు న్యాయ సేవలు అందించాలని వారు అకాంక్షించారు. ఉమాపతికి అవార్డు రావడం పట్ల మిక్కి రాష్ట్ర అధ్యక్షులు విప్లవ గాంధీ, సీనియర్ నాయకులు సీనియర్ నాయకులు కాటిక రామస్వామి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు దుబ్బ నాగేష్, ఉపాధ్యక్షులు మోహన్ కోశాధికారి రాజన్న, మిక్కి సభ్యులు బాల్ జంగయ్య బీముడు రమేష్ నరేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.




ఎల్ఎల్ఎం పట్టాను అందుకుంటున్న ఉమాపతి

## స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన తోటి మిత్రులు

**వెల్దండ, డిసెంబరు 29 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన రిపోర్టర్ శ్రీరాములు అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందినారు. ఈ విషయం తెలుసుకున్న వెల్దండ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కలిసి చదువుకున్న తోటి స్నేహితులు ఆదివారం శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసి రూ.40వేల ఆర్థిక సహాయాన్ని శ్రీరాములు కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో ఏ ఆపద వచ్చిన అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మట్ట చంద్రశేఖర్ గౌడ్, బిక్కుమాండ్ల శ్రీనివాసులు, చిమ్ముల అల్వాల్ రెడ్డి, తుంగ కుమార్, పందెం కృష్ణారెడ్డి, గంగధారి మల్లేష్, బాలమణి, సరిత, నాగమణి, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

## ముగిసిన ఖోఖో సెలక్షన్‌లు

**కల్వకుర్తి, డిసెంబరు 29 ప్రభాతవార్త:**ఉమ్మడి పాలమూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఖోఖో సెలక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఖోఖో ప్రధాన కార్యదర్శి విలియం, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి నిరంజన్‌యాదవ్, సామ రమేష్, ఖోఖో ఆర్గనైజ్ కార్యదర్శి గోకుమల్ల రాజు, పిఈడి కే ప్రకాష్, పిఈడి మోహన్లాల్, పిఈడి పురంచంద్, వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఖోఖో సెలక్షన్ పోటీలు ముగిశాయి. ముఖ్య అతిథు లుగా కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కాటన్ మిల్ కార్మిక సంఘ అధ్యక్షులు సూర్య ప్రకాష్‌రావులు హజరై ఖోఖో క్రీడల ను తిలకించి సెలక్షన్ అయిన విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, వెల్దండ సీనియర్ క్రీడాకారుడు వై.విజేందర్‌రెడ్డి, బన్నె శ్రీధర్, బాలరాజ్‌గౌడ్, గంగాధరి శ్రీనివాస్, జంగిలి ఆనంద్, తెలుగమ్మల రవి, జయరాం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



సెలక్షన్ అయిన విద్యార్థులతో పలువురు నాయకులు

## తెలంగాణ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గద్వాల మ్యాడం రామకృష్ణ ఎన్నిక

**గద్వాల,డిసెంబరు29 ప్రభాతవార్త :** తెలంగాణ చేనేత ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శిగా గద్వాల జిల్లాకు చెందిన మ్యాడంరామకృష్ణ ఎన్నికయ్యారు. హైదరాబాద్ నందు ధనుంజయ గార్డెన్ హయత్‌నగర్‌లో తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్, టిఆర్పిఎస్ రాష్ట్రఅధ్యక్షుడు వల్లకాటి రాజకుమార్ పాల్గొనారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోల్ భాస్కర్ తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడుగా రాపోలు వీరమోహన్ ప్రధానకార్యదర్శిగా మ్యాడం రామకృష్ణ కోశాధికారిగా జెల్లా రఘుచే ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 33 జిల్లాల చేనేత ప్రతినిధులు పద్మశాలి సంఘం నాయకులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.




ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గద్వాల మ్యాడం రామకృష్ణ

## ఈ నెల 31న తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి మహబూబ్‌నగర్ రాక

**నారాయణపేట టౌన్,డిసెంబరు 29 ప్రభాతవార్త:**ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై అధ్యయనం కోసం ఈనెల31న తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డా.షమీమ్ అఖ్తర్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఎస్సి కులాల వర్గీకరణపై అధ్యయనము కోసం విచారణ కమీషన్ తరపున తెలంగాణ హైకోర్ట్ మాజీ న్యాయ మూర్తి ఇతర సభ్యులు ఈనెల 31న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు రామన్నట్టు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాలోని అన్ని ఎస్సి కులసంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కులసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ వారి కార్యాలయములో హాజరై విజ్ఞాపనలు వ్రాత పూర్వకంగా సమర్పించుకోవచ్చని కలెక్టర్, సిక్తా పట్నాయక్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు.

# క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు

**విద్యార్థుల్లో దాగివున్న ఉన్న నైపుణ్యాన్ని వెలిగించేందుకే క్రీడలు.. పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి**

**నారాయణపేట టౌన్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు, విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందన్నారు. భాగంగా గ్రామ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయిల్లో పోటీ పడి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు మాట ప్రకారం 240 మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్సులను మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం క్రీడాకారుల ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ కనబర్చి జిల్లాకి పేరు తీసుకురావాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. చదువుతోపాటు విద్యార్థులు క్రీడలలోనూ రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ముం దు ముందు విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకు సాగితే అనుకున్న గమ్యాన్ని చేరుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి , కౌన్సిలర్ సలీం, డైరెక్టర్ శరణప్ప, కాంగ్రెస్ నాయకులు గాజుల శివకుమార్, మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి, సంతోష్ (రిటైర్డ్ టీచర్), డివైఎస్ఓ, పిఈటిలు, ఉపాధ్యాయులు, అధికారులతో బాటు తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ డ్రస్‌ను అందజేస్తున్న దృశ్యం



క్రీడాకారులతో మాజీ డిసిసి అధ్యక్షులు తదితర నాయకులు

## వన్యప్రాణుల సంరక్షణపై అటవీశాఖ ప్రత్యేక చర్యలు

**బిజినేపల్లి, డిసెంబరు 29 ప్రభాతవార్త :** వేసవి నేపథ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దేవరాజ్ ఆదేశాల మేరకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. మూగజీవాల రక్షణకు అధికారులు గంగారం ఫారెస్ట్ బీట్‌లో ఆదివారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. అడవిలోని మూగజీవాల దప్పిక తీర్చడానికి అటవీశాఖ ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి కాలంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి సాసర్ పిట్లు, సోలార్ పంపుల పనితీరు పరిశీలించారు. అడవిని కాపాడడమే తమ ముఖ్య లక్ష్యమని, అడవిలో సీసీ కెమెరాలు పెట్టి జంతువుల ఆనవాళ్లను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నారు. వేసవిలో తాగునీరు దొరకపోవడంతో అటవీ జంతువులు అడవిని దాటి వెళ్లకుండా చర్యలు చేపట్టారు. తద్వారా వణ్యప్రాణులు బయటకు వెళ్లకుండా అడవిలోనే దాహార్తిని తీర్చుకునేందుకు అవకాశం ఉందని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంటి తెలిపారు. గంగారం ఫారెస్ట్ బీట్‌లో చిరుత పులులు, జింకలు, సాంబార్లు, ఎలుగుబంట్లు, దుప్పులు ఇతరత్రా వన్య మృగాలు బయటకు వెళ్లకుండా అడవిలోనే దాహార్తిని తీర్చుకునేందుకు అవకాశం ఉందని బీట్ ఆఫీసర్ మోహన్ తెలిపారు. మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు అటవీ అధికారులు చేపడుతున్న చర్యలపై పకృతి ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గంగారం ఫారెస్ట్ బీట్ లో సోలార్ పంప్ సెట్ బిగిస్తున్న అధికారులు



అటవీ ప్రాంతంలో త్రాగునీటి కోసం ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్

## 40 సంవత్సరాల అపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పెబ్బేరు డిసెంబరు 29 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ 1983-84 సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు అందరూ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని లో 40 వ సంతాలు పూర్తి అయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల అందరూ కలిసి అపూర్వ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. శ్రీ రంగనాయక స్వామి సన్నిధిలో రంగనాయక స్వామిని దర్శనం చేసుకుని శ్రీరంగాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ ను సందర్శించి, అనంతరము పెబ్బేరు సహారా ఫంక్షన్ హాల్లో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు విద్యను బోధించినటువంటి గురువులను అందరిని ఆహ్వానించి వారిని శాలువా పూలమాలతో, పాటు జ్ఞాపికలు ఇచ్చి ఉపాధ్యాయులను సన్మానించి వారికి పాదాభివందనాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ చిన్ననాటి గుర్తులను గుర్తు చేసుకుంటూ వారు ఈ రోజు కలవడం ఒక శుభ సూచకమని అదేవిధంగా ప్రతి ఒక్కరూ ఈ వివిధ హోదాలలో అత్యున్నతంగా అభివృద్ధి పథంలో ఉండి, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మా గురువులు అయినటువం టి శివన్న, సూర్యనారాయణ, బుచ్చన్న, వెంకటరామిరెడ్డి ,సూర్యనారాయణ, వరదరాజులు ,కృష్ణారెడ్డి ,గోపాల్ రెడ్డి, సుగుణబ్రహ్మం, రాఘవాచారి, రంగస్వామి , ఉపాధ్యాయులను శాలువా పూలమాలతో సన్మానిస్తూ వారి చిరస్మరణీయ గుర్తులను గుర్తుచేసుకొని ఆనందంతో కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అందరిని ఒక తాటిపైకి తీసుకు వచ్చినటువంటి ఆర్ కురుమూర్తి అనిత లక్ష్మికి పూర్వ విద్యార్థులు అందరూ కలిసి వారికి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో వెంకటేశ్వర్ రెడ్డి రఘునాథ్ రెడ్డి , తిరుపతయ్య గౌడు,ఎన్ వెంకటేష్ గౌడ్ , డాకేష్ గౌడ్ ,హర్షవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రామకృష్ణ, ఎం వెంకటయ్య యాదవ్, గోవిందు నాయుడు,అనిత ,లక్ష్మి, ఉమాదేవి, వరలక్ష్మి కోటేశ్వరి, అనురాధ, ఆంజనేయులు, ఆంజనేయులు గౌడ్, రంగస్వామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



అపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## భూత్పూర్ సాహితీ సత్యంకు గౌరవ డాక్టరేట్

**సత్యంను అభినందించిన ట్రస్మా సభ్యులు**

**భూత్పూర్,డిసెంబరు 29,ప్రభాతవార్త :** విద్యారంగం,సామాజిక రంగాలలో విశిష్ట సేవలందించినందుకుగాను భూత్పూర్ సాహితీ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ సత్యనారాయణ(సత్యం)కు2024 సంవత్సరానికిగాను హైదరాబాద్ ఆబిడ్స్‌లోని సారస్వత పరిషత్ కళావేదకలో మనం ఇంటర్నేషనల్ ఫౌండేషన్ శనివారం గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రదానం చేసింది. కళావేదికలో ఫౌండేషన్ చైర్మన్,న్యాయవాది చక్రవర్తి చేతుల మీదుగా సత్యనారాయణ(సత్యం) డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ చక్రవర్తి మాట్లాడుతూ సత్యనారాయణ విద్యా రంగంతో పాటు సామాజిక రంగంలో కూడా తన వంతు కృషిచేస్తూ సేవలందిస్తున్నారని,భవిష్యత్తులో విద్యా,సామాజిక రంగాలతో పాటు సాంస్కృతిక రంగాలలో కూడా విద్యార్థుల్ని తీర్చి దిద్ది వారి భవిష్యత్తు బంగారు బాటను వేయాలని సూచించారు. 2024 సంవత్సరానికిగాను డాక్టరేట్ అందుకున్న సత్యనారాయణ మాట్లాడుతూ మనం ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతీ ఏటా సమాజంలో విశిష్ట సేవలందిస్తున్నవారిని గుర్తించి వారికి డాక్టరేట్ ప్రదానం చేయడం హర్షింపతగ్గ అంశమని పేర్కొన్నారు. తనకు అవార్డు దక్కడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి రుణ పడి ఉంటానని డాక్టర్ సత్యనారాయణ అన్నారు. విద్యా,సామాజిక రంగాలలో తన సేవ ఎల్లవేళలా కొనసాగుతుందని పేర్కొన్నారు.



మనం ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌చే డాక్టరేట్ అందుకుంటున్న సాహితీ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ సత్యం

## అర్‌పిలకు కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలి

**ఆర్‌పిల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రమ**

**నారాయణపేట టౌన్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** పట్టన పేదరిక నిర్మూలన పథకంలో పని చేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్ (ఆర్పి) లకు కనీస వేతనం జిఓ నంబర్ 60 ప్రకారం రూ. 18000 ఇవ్వాలని ఆ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రమ డిమాండ్ చేసారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో మోడ్రన్ ఉన్నత పాఠశాలలో అర్పి ల జిల్లా అద్యక్షులురాలు సౌభాగ్య అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సుకు ఆమె ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అనేక సర్వేలను అర్ పి లకు అప్పజెప్పి పని తీసుకుంటున్నారు కానీ శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. ఇచ్చే 6 వేల అరకొర వేతనం 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే విడుదల చెయ్యాలని డిమాండ్ చేసారు. ఆర్పిలు చేస్తున్న శ్రమకు ఇచ్చే వేతనం కూడా ఆర్ పిల ఖాతాలో వెయ్యడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. యూనిఫారం, ప్రమాద భీమ సౌకార్యం కల్పించాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి జిల్లా కార్యదర్శి బాల్ రామ్ లు మాట్లాడారు కార్మిక సంక్షేమము కోసం ప్రభుత్వాలు పనిచెయ్యడం లేదన్నారు. కార్మిక హక్కుల కోసం కార్మిక కార్గం ఏకం కావాలన్నారు. 1970 ఆవిర్భవించిన సిఐటియు ఉద్యోగ కార్మిక హక్కులకోసం సమరశీలంగా పోరాడే సంఘమన్నారు. తెలంగాణ మెప్మా ఆర్పిల యూనియన్ జిల్లా నూతన కమిటి ఎన్నిక ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సౌభాగ్య, జ్యోతి, లింగమ్మ, కవిత, రమాదేవి, పుష్ప, సుజాత, రాజేశ్వరి, విజయలక్ష్మి, రఘు బాయ్, శ్రీలత,నాగేంద్రమ్మ తో పాటు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రమ

## క్రీతిక చికిత్స కోసం ఐదు లక్షలు మంజూరు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 29 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామానికి చెందిన చిన్నారి క్రీతిక చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి రూ.5 లక్షల ఎల్ఓసి లెటర్ మంజూరు చేయించారు. తూడుకుర్తి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ కుమార్తె క్రీతిక (7 సంవత్సరాలు)కు అక్యూట్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సీఎం కార్యాలయంలో మాట్లాడి బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు రూ.5లక్షల ఎల్ఓసి లెటర్ మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం పాప త్వరగా కోలుకోవాలని, భవిష్యత్తులో పాప ఆరోగ్యపరంగా ఇంకా ఏమైనా అవసరం ఉంటే తనను సంప్రదించాలని వారికి భరోసా కల్పించారు. చెప్పిన వెంటనే స్పందించి పాప ఆరోగ్యం కోసం సహాయం అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్‌రెడ్డికి విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్ఓసీ చెక్కును అందజేస్తున్న దృశ్యం

## టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడుకు సన్మానం

**కల్వకుర్తి, డిసెంబరు 29 ప్రభాతవార్త:**తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్ బిఆర్ నాయుడుని ఆదివారం ఉదయం ఆయన కార్యాలయంలో వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్, సామాజికవేత్త కొమ్ముగోని శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## టెస్కబ్ చైర్మన్‌ను కలిసిన డిసిసిబి చైర్మన్

**పెబ్బేరు డిసెంబరు 29 ప్రభాతవార్త:**హైదరాబాద్‌లోని కార్యాల యంలో టెస్కబ్ చైర్మన్ రవీందర్ రావును మహబూబ్‌నగర్ డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డి, పెబ్బేరు సింగిల్ విండో వైచెర్మన్ గౌని కోదండరామ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మాణిక్య రెడ్డి, శివప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో ఆడబిడ్డ జననం

**పెబ్బేరు డిసెంబరు 29 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం అయ్యవారి పల్లి గ్రామం సమీప్న లో రేణుక నొప్పులు ఎక్కువ రావడంతో 108 సమాచార ఇచ్చారు అందుబాటులో ఉన్న చిన్నంబావి అంబులెన్స్ అయ్యవారిపల్లి గ్రామానికి చేరుకొని మార్గమధ్యలో పోతుండగా నొప్పులు ఎక్కువ కావడంతో డెలివరీ చేయడం జరిగింది. రేణుకకు పండంటి ఆడపిల్ల పుట్టింది ఇద్దరు క్షేమంగా ఉన్నారు. దగ్గర్లో ఉన్న పెబ్బేరు పీహెచ్‌సిలో అడ్మిట్ చేశారు. ఈఎంటి శ్రీధర్ అండ్ పైలట్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడలకు ధన్వాడ విద్యార్థుల ఎంపిక

**ధన్వాడ, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడలకు ఎంపికయ్యారు. ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శివకుమార్, శైలజ విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ముజీబ్ తెలిపారు. మహబూబ్‌నగర్ లో జగగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## నేషనల్,ఇంటర్ నేషనల్ అబాకస్ పోటీల్లో పేట విద్యార్థుల ప్రతిభ

**నారాయణపేట టౌన్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** మహారాష్ట్ర పూణే నగరంలో ఆదివారం నిర్వహించిన 7వ నేషనల్,14వ ఇంటర్ నేషనల్ అబాకస్ పోటీల్లో నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు విద్యార్థులు అశేష ప్రతిభ కనబరిచారు. అబాకస్ సి 4 లో చరణ్ ప్రథమ స్థానం సి 3 లో వైష్ణవి ద్వితీయ స్థానం,రిషిక్ మూడో స్థానం,ఖుషి నామాజీ ప్రోత్సాహక బహుమతులు పొందారు. వీటిని పట్టణ విద్యావంతులు పలువురు అభినందించారు.

## 12వ రోజు దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

**గద్వాల,డిసెంబరు 29 ప్రభాతవార్త :** జిల్లా కోర్టు కాంప్లెక్స్ ను పీజేపీ క్యాంపులో నిర్మించాలని డిమాండ్ చేస్తూ రిలే నిరసన న్యాయవాదులు రిలే నిరసన దీక్షలు చేపట్టారు.12వ రోజు దీక్షలో సీనియర్ న్యాయవాదులు కే.రవిప్రకాష్‌గౌడ్, శివప్రి య, మహాలక్ష్మి, ఎక్బాల్ పాషా, కే.విజయ్ కుమార్‌లు కూర్చున్నారు. ఈ దీక్షలో కూర్చున్న న్యాయవాదులకు, రఘురామిరెడ్డి, వెంకట్ రామిరెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డిలు ఇస్మాయిల్, ఖాజా మొయినుద్దీన్, మురళిలు మద్దతు ఇచ్చారు.

## దొంగ ద్విచక్ర వాహనాలకు అడ్డగా మారిన నిడ్జింత గ్రామం

**మద్దూర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని నిడ్జింత గ్రామం అడ్డాగా మారింది. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి హైదరాబాదుకు చెందిన మరో వ్యక్తితో పరిచయాలు ఏర్పరచుకొని హైదరాబాదులో దొంగతనం చేసిన బుల్లెట్ తదితర వాహనాలను నిడ్జింత గ్రామానికి చెందిన వ్యక్తి దగ్గరికి తరలించి వాహనాలను అమ్ముకుంటున్నట్లు సమాచారం. ఈ మేరకు హైదరాబాద్ పోలీసులు ఆదివారం ఉదయం నిడ్జింత గ్రామానికి చేరుకుని ఆ వ్యక్తిని పట్టుకొని వివరాలు సేకరించగా రూ.25 వేల రూపాయలకు అమ్ముకున్నట్లు విశ్వాసనీయ సమాచారం. పోలీసులు 35 బుల్లెట్ వాహనాలను సేకరించి హైదరాబాదుకు తరలించినట్లు సమాచారం ఉంది. ఈ సంఘటనపై మద్దూరు ఎస్సైని సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని వివరించారు.